తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8
Follow :



## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు
# ప్రతి ఒక్కరూ పాటుపడాలి : కలెక్టర్ అంకిత్

### భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్‌లు, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని, తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మహిళల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఐలమ్మ పోరాటాలు, ఆశయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పి. విజయలక్ష్మి, జిల్లా అధికారులు, బీసీ సంఘాల నాయకులు నేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, కే వంశీ, పి కొండల్, పి శంకర్, ఎన్ మల్లయ్య, ఎన్ మోహన్ రావు, కొదుమూరి సత్యనారాయణ, జి సత్యనారాయణ తదితరులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తుది దశకు చేరిన
# గణేష్ నిమజ్జనాలు

- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తున్న విగ్రహాలు..
- కిటకిటలాడుతున్న జాతీయ రహదారి..
- నిమజ్జనం తర్వాత రామయ్య దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు..



వార్తా 3వ పేజీలో

## వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం
### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట (జనంసాక్షి):**
వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం కలెక్టరేట్ లో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు.భూమి, ఆత్మ గౌరవం కోసం ఆమె చేసిన పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భావితరాలకు ఆమె జీవితం మార్గదర్శకమని తెలిపారు.కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్ రాజ్ , జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి డి.విశాల్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, డిఐఈఓ సులోచన రాణీ, జీఎం ఇండస్ట్రీస్ భారతి, వివిధ కుల సంఘాలు నాయకులు, సభ్యులు,జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్‌లో బెల్ట్‌షాపుల జోరు!




- "బెల్ట్‌షాపులు ఉండవు" అన్న ఎమ్మెల్యే మాటకు సవాల్
- కిరాణా ముసుగులో మద్యం.. తెల్లవారుజాము నుంచే విక్రయాలు
- అర్ధరాత్రి దాటినా 'తలుపు తడితే' బాటిల్.. సిట్టింగ్‌లపై ఆరోపణలు

వార్తా లోపలి పేజీలో

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- తెలంగాణ పీపుల్స్ ఫ్రెండ్ బస్ యాత్ర
- ప్రభుత్వ పాఠశాలలో బస చేసిన నాయకులు, విద్యావేత్తలు



**మాడుగులపల్లి సెప్టెంబర్ 26 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన ఉచిత విద్యను ప్రతీ పేద, మధ్యతరగతి విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ విద్యావ్యవస్థను తక్షణమే బలోపేతం చేయాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రెండ్ నాయకులు, విద్యావేత్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విద్యా పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన తెలంగాణ పీపుల్స్ ఫ్రెండ్ బస్ యాత్ర మాడుగులపల్లి మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా స్థానికులు ఘన స్వాగతం పలికారు బస్ యాత్ర ముగిసిన అనంతరం నాయకులు, ప్రముఖులు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో రాత్రి బస చేశారు ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ పద్మజ షా, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల అడ్డగోలు ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రధాన డిమాండ్లు ఫీజుల నియంత్రణ చట్టం ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక చట్టం తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలి బడ్జెట్‌లో 18% నిధులు ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయిస్తూ చట్టం చేసి అమలు చేయాలి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో అవసరమైన మౌలిక వసతులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తీసుకురావాలి పాఠశాలల నిర్మాణ చట్టం: 60 ఇండ్ల పరిధి నమూనా (మోడల్) ఆధారంగా పాఠశాలల నిర్మాణానికి ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో సృజన యాదవ్, ముప్పూరి కుమార్, డాక్టర్ జగదీశ్వర్, డిఎస్పి విజయ్ కుమార్, నిఖిల్ విజయ్ కృష్ణ, స్థానిక సర్పంచ్ అరూరి నరేష్, ఉప సర్పంచ్ మల్లేపల్లి వెంకన్న, విద్యాభిమానులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ వీర నారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు



తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలను శనివారం పెనుబల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వి ఎం బంజర్ లొ గల సాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు, శనివారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని అన్నారు.

తుంగతుర్తి జనంసాక్షి



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగాశనివారం తాసిల్దార్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బి పద్మ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం భూస్వాముల పెత్తందారిపై విరోచితంగా పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పి మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన దిర వనిత చాకలి ఐలమ్మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఎన్ పార్వతమ్మ, ఆర్ ఐ సునీత, జిపిఓ లు పర్వతాలు, లతీఫ్ గాలిబు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామంలో శివ మాచి రజక సహకార సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి టీపీసీసీ ప్రతినిధి లక్ష్మీనారాయణ రెడ్డి, ఎర్నేని బాబు, పారసీతయ్య, పిల్లుట్ల శ్రీను తదితర ముఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను చండూరు పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



హుజూర్‌నగర్, జనంసాక్షి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు పట్టణ లాండ్రీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద యూనియన్ అధ్యక్షులు ఇందిరాల నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పట్టణ రజక సంఘం అధ్యక్షులు ఇందిరాల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు రేపాకుల కోటయ్య లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామ పంచాయతీలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చిన్నకాపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.



## లంకపల్లి లో వీర నారి ఐలమ్మ జయంతి వేడుకలు..

**ఐలమ్మ నూతన విగ్రహాఆ విష్కరణ..**

**రజక సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం..**

పెనుబల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి)

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ131వ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలోశనివారం లంకపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ జయంతి సందర్భంగా గ్రామంలో ఐలమ్మ నూతనవిగ్రహా ఆవిష్కరణ తోపాటు, రజక సంఘం కమ్యూనిటీ నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మాచినేని రాజాబాబు, మాజీ సర్పంచ్ మువ్వా సరోజిని పాల్గొన్నారు. కీర్తిశేషులు మాచినేని రామకృష్ణయ్య, మాచినేని పద్మావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సర్పంచ్ మాచినేని రాజబాబు, సోదరులు, రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని వితరణగా ఇచ్చారు. కీర్తిశేషులు సూరటి చైతన్య జ్ఞాపకార్థం భర్త సూరటి కృష్ణారావు ఐలమ్మ విగ్రహాన్ని అందించారు. గ్రామ సర్పంచ్, కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అలాగే మువ్వా విజయ్ బాబు తల్లి మాజీ సర్పంచ్ మువ్వా సరోజినీ ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. భారీ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు రెండు లక్షల రూపాయల విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, లంకపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

మోటకొండూరు మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై కుమారస్వామి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, కేక్ కట్ చేసి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తమ రజక సామాజిక వర్గాన్ని బీసీ నుంచి ఎస్సీ జాబితాలో చేర్చాలని, కమ్యూనిటీకి సంబంధించిన ఇతర న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు వడ్డేబోయిన జహంగీర్, జంగపల్లి రాజయ్య, వడ్డేబోయిన వెంకటేష్, కృష్ణ, నారోజు నాగులు, శ్రీను, రాజు, శ్రీనివాస్, నారపల్లి నర్సింహులు, వడ్డేబోయిన రాజయ్య, పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంగడి ప్రదేశంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# తుది దశకు చేరిన గణేష్ నిమజ్జనాలు



- ○ రాష్ట్రం నలుమూలల నుంచి తరలివస్తున్న విగ్రహాలు..
- ○ కిటకిటలాడుతున్న జాతీయ రహదారి.
- ○ నిమజ్జనం తర్వాత రామయ్య దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

**భద్రాచలం సెప్టెంబరు 26 (జనంసాక్షి)**
భద్రాచలంలో గణేష్ నిమజ్జనాల సందడి తుది దశకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను నిమజ్జనం చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో భద్రాచలానికి తరలివస్తుండటంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. కూనవరం రోడ్డులోని జాతీయ రహదారి నుంచి గోదావరి నిమజ్జన ఘాట్ వరకు గణనాథుల విగ్రహాలతో కరకట్ట ప్రాంతం కిక్కిరిసిపోతోంది. గత వారం రోజులుగా రాత్రింబవళ్లు నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతుండగా, ఇప్పటి వరకు 2,040 విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. మరో 500 వరకు విగ్రహాలు భద్రాచలానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో ఆదివారం, సోమవారం కూడా నిమజ్జన కార్యక్రమాలు కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. కరీంనగర్ , వరంగల్ , ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో గణనాథుల విగ్రహాలు భద్రాచలానికి తరలివస్తున్నాయి. భారీ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో తీసుకొస్తుండటంతో జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా గణనాథులే కనిపిస్తున్నారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలు కరకట్ట వైపు వరుసగా నిలుస్తుండటంతో రహదారులపై సందడి నెలకొంది. నిమజ్జన ఘాట్ వద్ద ఒక్కో విగ్రహాన్ని గోదావరిలోకి తరలించి నిమజ్జనం చేయడానికి సమయం పడుతుండటంతో క్యూలు గంటల తరబడి కొనసాగుతున్నాయి. నిమజ్జనం కోసం వచ్చిన భక్తులు తమ వంతు కోసం వేచి ఉండాల్సి రావడంతో కొందరు అసహనానికి గురవుతున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక కొందరు గోదావరి బ్రిడ్జిపై నుంచే విగ్రహాలను నదిలోకి వదులుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిడ్జిపై నుంచి విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని పోలీసులు పదేపదే సూచిస్తున్నప్పటికీ కొందరు పట్టించుకోకుండా నదిలోకి విగ్రహాలను వదులుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి చర్యల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో గోదావరి ఘాట్ , కరకట్ట, జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు, తిరిగి వెళ్లే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు వాహనాలను నియంత్రిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గోదావరి తీరంలో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. భక్తులు నదిలోకి ప్రమాదకర ప్రాంతాల్లో వెళ్లకుండా పోలీసులు సూచనలు చేస్తున్నారు.

**- నిమజ్జనం తర్వాత రామయ్య దర్శనం**
భద్రాచలానికి గణనాథుల నిమజ్జనం కోసం వచ్చిన భక్తుల్లో చాలామంది నిమజ్జనం అనంతరం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో భద్రాద్రి దేవస్థానంలోనూ భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి రామయ్య దర్శనానికి తరలివస్తున్నారు. గోదావరిలో నిమజ్జనం పూర్తి చేసుకున్న అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఒకవైపు గోదావరి తీరంలో గణనాథుల నిమజ్జనాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా.. మరోవైపు రామయ్య దర్శనానికి వస్తున్న భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. నిమజ్జనం కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు భద్రాచలం ఆలయాన్ని దర్శించుకోవడంతో పాటు పట్టణంలోని పలు ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తున్నారు.

**- పర్ణశాలకు పోటెత్తుతున్న భక్తులు**
భద్రాచలంతో పాటు పర్ణశాలకు కూడా భక్తుల రద్దీ పెరిగింది. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు భద్రాద్రి రాముడిని దర్శించుకున్న అనంతరం పర్ణశాలకు వెళ్తున్నారు. అక్కడ సీతారాముల పాదుకా ప్రాంతం, రామాలయం, ఇతర ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తున్నారు. దీంతో భద్రాచలం నుంచి పర్ణశాల వరకు భక్తుల సందడి కనిపిస్తోంది.
గణేష్ నిమజ్జనాలు మరో రెండు రోజులపాటు కొనసాగనున్న నేపథ్యంలో భద్రాచలానికి మరిన్ని విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసులు, దేవస్థానం అధికారులు, మున్సిపల్ , రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. గోదావరి వద్ద భద్రతా సూచనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. గణనాథుల నిమజ్జనం, గోదావరిలో పుణ్యస్నానాలు, రామయ్య దర్శనాలతో భద్రాచలంలో శుక్రవారం భక్తి సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పట్టణంలోని ప్రధాన రహదారులు, గోదావరి కరకట్ట, ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మరో రెండు రోజులపాటు ఇదే తరహాలో భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

## సెప్టెంబర్ 30 వరకు గ్రామాల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం

**నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 26,(జనంసాక్షి):**
రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సేవలు సులభంగా,పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్రిస్టాక్?ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.ఇందులో భాగంగా సెప్టెంబర్ 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో ప్రత్యేక ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతులు తమ ఆధార్ కార్డుతో సంబంధిత ఏఈఓను సంప్రదించి నమోదు చేసుకోవచ్చు. అలాగే సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో కూడా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకునే అవకాశం ఉంది.నమోదు సమయంలో రైతులు ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన పత్రాలు, మొబైల్ ఫోన్ తదితర అవసరమైన వివరాలను వెంట తీసుకెళ్లాలని అధికారులు సూచించారు.



**ఫార్మర్ రిజిస్ట్రీతో పలు ప్రయోజనాలు:**
ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుల భూమి, పంటలు, ఇతర వ్యవసాయ సంబంధిత వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తారు. దీనివల్ల అర్హులైన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా అందించేందుకు వీలవుతుంది.ఎరువుల బుకింగ్, పీఎం కిసాన్ లబ్ధి, వరి, పత్తి తదితర పంటల విక్రయం, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.కావున జిల్లాలోని ప్రతి రైతు సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

# తుంగతుర్తికి అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు పట్ల హర్షం

## బార్ అసోసియేషన్ అధ్యక్షులు, జ్ఞాన సుందర్



తుంగతుర్తి సెప్టెంబర్ 26 (జనం సాక్షి)
తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రం లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నపర్తి జ్ఞాన సుందర్ హర్షం వెలిబుచ్చారు, శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అదనపు కోర్టు మంజూరు చేసినందుకు ముఖ్య మంత్రికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తీ కి ధన్యవాదాలు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తికి జూనియర్ సివిల్ కోర్టులో పని భారం బాగా పెరిగిందని దానితోపాటు కక్షిదారులకు సకాలంలో న్యాయం అందక ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు, ఈ అదనపు జూనియర్ కోర్టు మంజూరు వలన కక్షిదారులకు సకాలంలో న్యాయం అందుతుందని కేసులు కూడా సత్వరమే పరిష్కారం అవుతాయని అన్నారు, ఈ సందర్భంగా కోర్టును మంజూరు చేసిన ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫర్వీన్, జనరల్. సెక్రటరీ వెంకటేశ్వర్లు, సెక్రెటరీ రవికుమార్, న్యాయవాదులు. ఎస్ కె. వజీర్. వేణురాజ్ బీ.సతీష్ బి. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

# కొండముచ్చు దాడిలో ఇరువురికితీవ్ర గాయాలు

## వరుస ఘటనలపై ప్రజల్లో ఆందోళన

**కల్లూరు సెప్టెంబర్ 26 (జనంసాక్షి)**
పట్టణంలో కొండముచ్చులు, కోతులు, కుక్కలుసంచారం ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. శనివారం కల్లూరు పట్టణంలో జాతీయ రహదారి ప్రక్కన బ్యాటరీ షాప్ నిర్వాకులు ఎలక్ట్రిషన్ వర్కర్ శాంతినగర్ కి చెందిన ఖమ్మం పాటి క్రాంతి పై కొండముచ్చు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన అబ్బూరి సత్యవతి సొంత పనులపై కల్లూరు రాగా కల్లూరు పట్టణ సెంటర్లో అంబేద్కర్ కూడలి సమీపంలో ఆకస్మికంగా కొండముచ్చు దాడి చేసి చేతి పై రెక్కి కొరికి గాయపరిచింది. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొండముచ్చులు, కోతులు, కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నప్పటికీ వాటి నియంత్రణకు సంబంధిత అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లోనే కొండముచ్చులు, కోతులు సంచరిస్తుండటంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇటీవల కల్లూరు పట్టణంలో కొండముచ్చుల దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాల పాలై కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్య సేవలు పొందిన సంఘటన మరువకముందే. మరో సంఘటన లో శనివారం ఇద్దరు వ్యక్తులు కొండముచ్చు దాడిలో తీవ్రంగా గాయపడటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఏదైనా ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు స్పందించరా? అంటూ కల్లూరు పట్టణ ప్రజలు, మేధావులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు .కల్లూరు మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, కుక్కలు స్వైర విహారంతో బెంబేలెత్తిపోతు వాటి దాడులతో గాయాలపాలై ఆసుపత్రులలో చికిత్సలు పొందిన సంఘటనలు ఇటీవల అనేకం చోటు చేసుకున్నాయి. ఇళ్లపైకి, దుకాణాలపైకి వస్తూ తీవ్ర అరాచకం సృష్టిస్తున్నాయని చిరు వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు, స్థానిక మున్సిపాలిటీ పాలకవర్గం, ఆటవీశాఖ అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి, ప్రజలపై దాడులకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్న, కోతులను కొండముచ్చులను పట్టుకుని అడవిలో వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు.



# అశ్వారావుపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ
- రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు.. భారీగా తరలివచ్చిన ప్రజలు

**అశ్వారావుపేట,సెప్టెంబర్ 26, (జనంసాక్షి):** తెలంగాణ సామాజిక, సాయుధ పోరాట చరిత్రలో తనదైన ముద్ర వేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ అశ్వారావుపేటలో ఘనంగా ఆవిష్కరించారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన ఐలమ్మ స్ఫూర్తిని స్మరించుకుంటూ అశ్వారావుపేట పట్టణంలోని రింగ్ రోడ్ సెంటర్లో హైస్కూల్ సమీపంలో ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విగ్రహాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఘనంగా ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా రింగ్‌సెట్ హైస్కూల్ పరిసర ప్రాంతం సందడిగా మారింది. రజక సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ.**

తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు ఎదుర్కొన్న అన్యాయాలపై ఆమె ధైర్యంగా గళమెత్తారని తెలిపారు. తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు, అన్యాయానికి తలొగ్గకుండా పోరాడిన తీరు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ విగ్రహాన్ని అశ్వారావుపేట పట్టణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఆమె చరిత్రను స్థానిక ప్రజలకు, ముఖ్యంగా యువతకు మరింత చేరువ చేసే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు.

**ఎమ్మెల్యే జారె చేతుల మీదుగా ఆవిష్కరణ..**

రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం కేవలం ఒక వర్గానికే పరిమితమైనది కాదని, అన్యాయాన్ని ఎదుర్కొనే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే పోరాట చరిత్ర అని పేర్కొన్నారు. యువత చరిత్రను తెలుసుకుని మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సమాజంలో ప్రతి వర్గానికి సమాన గౌరవం, అవకాశాలు లభించేలా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఘనంగా నిర్వహించిన రజక సంఘం**

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు విగ్రహ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహావిష్కరణ అనంతరం ఐలమ్మ జీవిత చరిత్ర, ఆమె పోరాట నేపథ్యాన్ని పలువురు నాయకులు వివరించారు. ఆమె చూపిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక చైతన్యాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**మహిళలకు స్ఫూర్తిదాయకమైన ఐలమ్మ జీవితం**

చాకలి ఐలమ్మ పోరాటం మహిళా సాధికారతకు కూడా ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా తన హక్కుల కోసం నిలబడిన ఐలమ్మ నేటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు.

మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, సామాజిక రంగాల్లో ముందుకు సాగేందుకు చారిత్రక మహిళా ఉద్యమకారుల జీవితాలు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆమె సేవలు, పోరాటం గురించి భవిష్యత్ తరాలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



**చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి**

చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల చరిత్రను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, వారి పోరాట స్ఫూర్తిని యువతకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడటం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, సామాజిక హక్కుల కోసం పోరాడటం వంటి విలువలను ఐలమ్మ జీవితం నేర్పుతుందని అన్నారు. ఆమె చరిత్రను పాఠశాలలు, కళాశాలలు, సామాజిక కార్యక్రమాల ద్వారా యువతకు చేరువ చేయాలని కోరారు.

**ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి**

సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం కోసం కృషి చేయడమే చాకలి ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అశ్వారావుపేట పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరగడంతో రజక సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ సంఘం తరఫున విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, మున్సిపల్ వైస్ చైర్మన్ జుపల్లి రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు మండల అధ్యక్షుడు చెన్నం శెట్టి సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, సిపిఎం పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు మహేష్, మున్సిపల్ కౌన్సిలర్లు మినీడా హరిబాబు, నార్లపాటి దివాకర్, కొల్లు రవి కిరణ్, ఆకుల శ్రీను, దండబత్తుల రమేష్, వెలుపుల సత్యనారాయణ, రజక సంఘం నాయకులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు మాడుగులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు



నేటి తరానికి చాకలి ఐలమ్మ జీవితం ఒక మార్గదర్శకమని, ఆమె పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. **రామన్నపేట,జనంసాక్షి**



తెలంగాణ వీరనారి, ధీర మహిళ చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **సూర్యాపేట జనంసాక్షి**



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మర్రిగూడ మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మర్రిగూడ మండల రజక సంఘం, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షులు ఐతరాజు బిక్షపతి మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. రజకుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్యులుకోసం ఎదురుచూపులు

○ గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడుతున్న రోగులు

○పేరుకు పెద్ద ఆసుపత్రి వైద్యం అందించడానికి వైద్యులు కరువు





**కల్లూరు సెప్టెంబర్ 26(జనంసాక్షి)**
అసలే వర్షాకాలం సీజన్, ఎల్ నీ నో ప్రభావంతో ఒకపక్కతీవ్రమైన ఎండల ప్రభావం, మరోవైపు, ఆకస్మికంగా తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధులు, జ్వరాలు బారిన పడి వైద్యం కోసం ప్రభుత్వాసులకు వస్తే వైద్య సేవలు వైద్యుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి రావటంతో ఓపిక నశించి వైద్యులు లేకుండా ఈ ఆస్పత్రి ఎందుకు అంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సంక్షేమం కోసం కల్లూరు పట్టణంలో 10.50 కోట్ల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పేషంట్లకు సరైన వైద్యం అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు.శనివారం కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్య సేవల కోసం రోగులు సుమారు 250 మంది వచ్చారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఓపి పేరు రిజిస్ట్రేషన్ చేసేందుకు హోమియోపతి ఆసుపత్రికి సంబంధించి అటెండర్గా విధులు నిర్వహించే ఓ వ్యక్తి, కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు ఏఎన్ఎం ,నర్సుల శిక్షణ కోసం వచ్చిన పలువురు సిబ్బంది ఓపి నమోదు చేస్తున్నారు. ఇదే తరుణంలో బీపీ చెక్ చేసేందుకు ఎవరు లేకపోవడంతో పేషెంట్లే స్వయంగా బీపీ మిషన్ చేతులకు పెట్టుకొని చెక్ చేసుకొని ఎవరికి వారే వెళు తున్నారు. ఈ విషయంపై పలువురు ఆసుపత్రికి వచ్చిన రోగులు అసలు మీరు డ్యూటీ చేస్తున్నారా! ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు ప్రవర్తిస్తున్నారు. బీపీ చెక్ చేసేందుకు కూడా సిబ్బంది లేరు. ట్రైనింగ్ పర్పస్ వచ్చినవాళ్లు అందుబాటులో ఉండటం లేదు.. ఇదెక్కడి ఆసుపత్రి అంటూ పలువురు రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇదిలా ఉండగా ఓపి రిజిస్ట్రేషన్ చేయించుకున్న రోగులు డాక్టర్ వద్ద చూపించుకునేందుకు రూమ్ వద్ద బారులు తీరి నిరీక్షిస్తున్నారు. ఉదయం11:30 గంటలు సమయం అయినప్పటికీ పేషంట్లను పరీక్షించేందుకు డాక్టర్లు అందుబాటులో లేరు. కేవలం ఒక మహిళ వైద్యురాలు ఇన్ పేషెంట్లుగా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న వారిని పరీక్షించేందుకు వెళ్లారని సిబ్బంది చెబుతున్నారు. వచ్చిన రోగులు మాత్రం గంటల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు పెద్ద ఆసుపత్రి డాక్టర్లు మాత్రం అందుబాటులో లేరు అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో నర్సులు సిబ్బంది పేషెంట్లకు సేవలందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఔట్సోర్సింగ్ లో ఒక వ్యక్తిని కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పారిశుద్ధ్య కార్మికుల విభాగంలో నియమించడంతోపాటు అతన్ని సూపర్వైజర్ గా పెట్టుకొని కల్లూరు సిహెచ్ సి సూపర్డెంట్ గా పనిచేస్తున్న డాక్టర్ బానోత్ రమేష్ విధులకు డుమ్మా కొడుతున్నాడని ప్రజల ఆరోపిస్తున్నారు. కల్లూరు లో ఆసుపత్రికి డ్యూటీ కి సక్రమంగా రాకుండా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు లో తన సొంత ఆసుపత్రిలో వైద్య సేవలు చేస్తున్నారు. కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు ఎవరైనా రాజకీయ నాయకులు వచ్చారా, విలేకరు లు వచ్చారా, పేషెంట్లు ఏమనుకుంటున్నారు, ఇతరత్రా సమాచారాలు సైతం అందించేందుకు డాక్టర్ ఏర్పాటు చేసుకున్న వ్యక్తి ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వైద్య రంగం బలోపేతానికి అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించేందుకు కోట్లాది రూపాయలు నిధులు కేటాయించి ఆధునిక అంగులతో ఆసుపత్రి భవనాలు నిర్మించి మాలిక సదుపాయాలు కల్పించడం జరిగింది. ఆసుపత్రిలో రోగులకు సేవలు అందించాల్సిన డాక్టర్లు అందుబాటులో ఉండకుండా రోగులను ఇబ్బందులకు గురి చేయటం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా వైద్యులను నియమించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం

## కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్- 26( జనంసాక్షి )**
సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం, వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. జమీందారుల పాలనలో కొనసాగిన వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు.చాకలి ఐలమ్మ సామాజిక సేవకురాలిగా, భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని, నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు.
సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను, వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు.
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, బిసి సంఘ నాయకులు తుపాకుల ఎలగొండ స్వామి, జక్కుల వెంకట రమణ, కొత్తకొండ శ్రీలక్ష్మి, తమ్మారపు బ్రహ్మయ్య, సట్టు వెంకటేశ్వర్లు, తెనాలి వీరబాబు, మాచర్ల వేలాద్రి, పగిడల కృష్ణవేణి, కణతాల నరసింహారావు, హరిప్రసాద్, వట్టికోట అప్పారావు, వల్లపు సోమరాజు, అమరగాని వెంకటేశ్వర్లు, లింగబోయిన పుల్లారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, బిసి కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వెంకేపల్లి లో నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్

**నూతనకల్ సెప్టెంబర్ 26 (జనంసాక్షి)**



ఎస్ జి ఎఫ్ తుంగతుర్తి నియోజకవర్గస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ను ప్రారంభించిన తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,పాక్స్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారి రాములు నాయక్వెంకేపల్లి సర్పంచ్ ఇమ్మడి జయ కుమార్ ఎస్ జి ఎఫ్ కబడ్డీ టోర్నమెంట్ అండర్ 14, అండర్ 17 గేమ్స్ ను వెంకేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల లో శనివారం ప్రారంభించడం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో నైపుణ్యం పొందాలని, విద్యార్థులందరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారుఈ కార్యక్రమంలో ఎంఈఓ రాములు నాయక్, శివయ్య, పీఈటి లు కల్పన, సమత, ఉపేందర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పాల్వాయి నాగయ్య, తోనుకునూరి సైదులు, పసుల అశోక్ యాదవ్ ,పవన్ రెడ్డి,నాగార్జున, కార్తీక్,వార్డు మెంబెర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మోసంగి గణనాథుని లడ్డూకు రూ.59,016 పలికిన సైదులు గౌడ్ దంపతులు

**గుర్రంపోడు:సెప్టెంబర్ 26 (జనంసాక్షి):**



గుర్రంపోడు మండలం మోసంగి గ్రామంలోని బొడ్రాయి సెంటర్లో ప్రతిష్ఠించిన గణనాథుని లడ్డూను వేలంపాటలో మండల గౌడ సంఘం ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు మండాది సైదులు గౌడ్ ఆయన సతీమణి నాగమణి దంపతులు రూ.59,016కు దక్కించుకున్నారు. గణనాథుని లడ్డూ వేలంపాటలో పాల్గొన్న సైదులు గౌడ్?నాగమణి దంపతులు అత్యధిక ధరకు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి గణనాథుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.అనంతరం బొడ్రాయి సెంటర్ నుంచి గణనాథుని శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రలో బొడ్రాయి సెంటర్ యువతతో పాటు గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నృత్యాలు, భక్తి కార్యక్రమాలతో సందడి చేశారు. అనంతరం గణనాథుని విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత: కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26 జనంసాక్షి:**



గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కందకుర్తి, యంచ వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన కోసం పనులను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచ వద్ద వద్ద ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వీలుగా శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు. ఎస్సారెస్పీ లో ప్రస్తుతం 46 టీ.ఎం.సీల వరకు నీరు నిలువ ఉందని, 20 నుండి 25 టీ.ఎం.సీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. మిగితా పనులను వెంటదివెంట చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు. కందకుర్తి, యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టేలా అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వీట్లు వద్దు... మొక్కలు ముద్దు!

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):**
పుట్టినరోజు అంటే స్వీట్లు పంచి వేడుకలు చేసుకోవడం సహజం. కానీ, దానికి భిన్నంగా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అర్వపల్లి మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. 'స్వీట్లు వద్దు... మొక్కలు ముద్దు' అనే పర్యావరణహిత నినాదంతో పాఠశాలలో మొక్కలు నాటిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పి. మల్లేష్ తెలిపారు.? శనివారం పాఠశాల 8వ తరగతి విద్యార్థిని గ్రేసి జన్మదినం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఇకపై పాఠశాలలో విద్యార్థుల జన్మదిన వేడుకల సందర్భంగా మిఠాయిలు పంచడానికి బదులుగా మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నట్లు హెచ్ఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తుఫాను నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

### పంటలు,తోటలకు తీవ్ర నష్టం.. పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య.



**దమ్మపేట సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** ఇటీవల కురిసిన భారీ వర్షాలు,తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు.వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు మామిడి, జీడి మామిడి, పామాయిల్ తోటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు గండుగలపల్లి క్యాంపు కార్యాలయంలో రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుమ్మడి నరసయ్య మాట్లాడారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు,తుఫాను ప్రభావంతో దమ్మపేట మండలనీల్లో పంటలు, తోటలు దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా మండలంలోని జగ్గారం, గురవాయిగూడెం తదితర గ్రామాల్లో మామిడి, జీడిమామిడి, పామాయిల్ తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.ఇప్పటికే రైతాంగం అనేక సమస్యల మధ్య పంటలు సాగు చేసిందని, పంటలు చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు, తుఫాను కారణంగా మరింత నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని నరసయ్య పేర్కొన్నారు. నష్టంపై ప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను పునరుద్ధరించాలి**

భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలను వెంటనే పునరుద్ధరించాలని నరసయ్య కోరారు. విద్యుత్ సరఫరాకు ఏర్పడిన అంతరాయాలను తొలగించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా అధికారులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**నిరుపేదలకు ఇంటి స్థలాలు,ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి**

అశ్వారావుపేట నియోజకవర్గంలో అనేక మంది నిరుపేదలు సొంత ఇళ్లు, ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని నరసయ్య తెలిపారు. ఉపాధి లభించని సమయంలో ఇళ్ల అద్దెలు చెల్లించలేక పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని, అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి:**

ఎన్నో సంవత్సరాలుగా పోడు భూముల్లో సాగు చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదల్లో ఇంకా అనేక మందికి పట్టాలు అందలేదని నరసయ్య పేర్కొన్నారు. గతంలో కొంతమందికి మాత్రమే పట్టాలు అందాయని, మిగిలిన సాగుదారులకు కూడా భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న వారిపై అటవీ అధికారులు దాడులు నిర్వహించడం, కేసులు నమోదు చేయడం ఆపాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన గిరిజన, గిరిజనేతర పోడు సాగుదారులందరికీ పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్,మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు,పండూరి వీరబాబు,బండి ఆదినారాయణ,కేసరి వెంకటేష్,లింగాలపల్లి గ్రామ సర్పంచ్ ఊకే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

### ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** గత 65 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో పోరాటాలు చేస్తున్నట్లు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల చట్టంలో రిజర్వేషన్ల అమలు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం, భవన నిర్మాణానికి ఎకరం భూమి సాధించినట్లు వెల్లడించారు. జిల్లా ఇన్‌ఛార్జిగా కాల్వ భాస్కర్ రావుభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌ఛార్జిగా కాల్వ భాస్కర్ రావును నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, శాఖల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి అక్టోబర్ 10 నాటికి పూర్తి చేయాలని సూచించారు. పాల్వంచ నూతన కమిటీ నియామక బాధ్యతలను ఆయనకు అప్పగించామని, కమిటీల్లో యువత, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.అసైన్డ్ భూముల సమస్య పరిష్కరించాలినిషేధిత భూముల సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. వెంటనే మూడు లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై విచారణ జరిపి ఎస్సీ, ఎస్టీ, నిరుపేద రైతులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.కొత్త విద్యుత్ యూనిట్లు నిర్మించాలికొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రంలో రద్దు చేసిన ఎనిమిది యూనిట్ల స్థానంలో వెంటనే 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు నూతన యూనిట్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ జెన్‌కో ఇన్‌ఛార్జిగా రిటైర్డ్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కొలిపాక ఆనందరావును నియమిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎర్మాల శివరాజ్, రాసూరి చంద్రశేఖర్, కాల్వ భాస్కర్ రావు, కాల్వ ప్రకాష్ రావు, ఎం. రాజేంద్రకుమార్, వాసిముల్ల సుందర్, కాసిముల్ల ఆనందరావు, కాల్వ రామారావు, కాలే పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గౌడ బజార్ గణేశుడి శోభాయాత్ర

### మహాన్నదానంతో పాటు భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు



అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామ గౌడ బజార్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. శనివారం ఉదయం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం గణేశుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తుల నృత్యాలు, గణపతి నామస్మరణలతో శోభాయాత్ర సందడిగా సాగింది. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర కొనసాగగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది విఘ్నేశ్వరుడి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.





# మున్సిపల్ షాపుల మాటున అక్రమ దందా!

### రూ.90 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు చేతులు మారుతున్న షాపులు?

### ఏడాదికి రూ.3,600 పన్ను.. నెలకు రూ.6 వేల వరకు అద్దె!



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్26 (జనం సాక్షి):** ప్రజలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేటాయించిన మున్సిపల్ షాపులు కొందరికి అక్రమ ఆదాయ వనరులుగా మారుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మున్సిపాలిటీకి క్రమం తప్పకుండా పన్నులు చెల్లించాల్సిన షాపులను కొందరు కేటాయింపుదారులు ఇతరులకు రూ. 90 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు విక్రయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.మరికొందరు ఒకే షాపును పలుమార్లు ఇతరులకు విక్రయిస్తూ రూ. 6.80 లక్షలకు పైగా అక్రమంగా ఆర్జించినట్లు సమాచారం. మరోవైపు మున్సిపాలిటీకి ఏడాదికి చెల్లించే పన్ను సుమారు రూ. 3,600 మాత్రమే ఉండగా, అదే షాపులను నెలకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అద్దెకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఒకరి పేరుతో రెండు, మూడు షాపులు కేటాయించబడినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు కేటాయింపుదారులు వ్యాపారం చేయకుండా ఇతరులకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారని, దీంతో నిజంగా స్వయం ఉపాధి అవసరమైన చిన్న వ్యాపారులకు అన్యాయం జరుగుతోందని స్థానికులు అంటున్నారు.మున్సిపల్ షాపులు ప్రజా ప్రయోజనం కోసమా.. లేక కొందరి వ్యక్తిగత ఆదాయం కోసమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

## పీఈటీపై పోక్సో కేసు..

# రిమాండ్‌కు తరలింపు

- **గుదిమల్ల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలు**
- **కలెక్టర్ ఆదేశాలతో విచారణ కమిటీ.. అనుచిత ప్రవర్తన జరిగినట్లు నిర్ధారణ**

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** గుదిమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరం గా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పీఈటీపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసు కున్న పోలీసులు విచారణ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

**కలెక్టర్ ఆదేశాలతో కమిటీ.**

ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డీఈఓ సూచనల మేరకు ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు పాఠశాలకు వెళ్లి విద్యార్థినులు, తల్లిదండ్రులు, సిబ్బందితో వివరాలు సేకరించినట్లు తెలిసింది. విచారణలో విద్యార్థినుల పట్ల పీఈటీ అనుచితంగా వ్యవహరిం చినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. దీనికి సంబంధించిన నివేదికను కమిటీ జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిసింది.తల్లిదండ్రుల ఫిర్యాదు, కమిటీ విచారణలో వెలుగుచూసిన అంశాలతో పాటు ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉంది.

# కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**కల్లూరు సెప్టెంబర్ 26(జనంసాక్షి)**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు సెంటర్‌లో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు అధ్యక్షతన భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాచర్ల భారతి ,మాదినేని రమేష్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించడంలో విఫలమైందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగ బద్ధ సంస్థలను కేంద్రంలోని అధికార పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని, దీనికి ఎన్నికల కమిషనర్ సహకరించడం దారుణమని విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని ఆందోళన వ్యక్తం చేశారు.సభకు అధ్యక్షత వహించిన తన్నీరు కృష్ణార్జునరావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, పారదర్శకమైన ఎన్నికల విధానం కోసం ప్రతీ ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. తక్షణమే రాజీనామా చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు దోమతోటి పుల్లయ్య, సామినేని హనుమయ్య, తిగుళ్ల బాబు, గంపల శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణవేణి ,సామినేని వీరభద్రం ,ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం పకీరమ్మ,నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.





## గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనుల ఎంపిక

**ఆత్మకూర్ (ఎం), సెప్టెంబర్ 26 (జనంసాక్షి):**
వీబీ-జీ రామ్-జీ కార్యక్రమం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి, ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సామాజిక పటం, వనరుల పటాలను రూపొందించి, గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.ఈ నెల 28, 29, 30 తేదీల్లో అన్ని గ్రామాల్లో ప్రజల సమక్షంలో పటాలను రూపొందించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కూలీలకు 125 రోజుల పని కల్పించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ బీసు ధనలక్ష్మి, ఏపీఓ, పీఎస్ శేఖర్, సాంకేతిక సహాయకులు, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌తో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం

**పంట మార్పిడి వైపు రైతులు అడుగులు వేయాలి**

**తుర్కపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):**
రైతులు పంట మార్పిడి వైపు అడుగులు వేయడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును చేపట్టి అధిక ఆదాయం పొందాలని పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, ఉద్యాన అధికారి స్నేహిత సూచించారు. తుర్కపల్లి రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి కాపు ప్రారంభమై సుమారు 30 ఏళ్లపాటు ఆదాయం పొందవచ్చున్నారు.

ఎకరానికి 10?12 టన్నుల దిగుబడితో ఏడాదికి సుమారు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు నికర ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. టీజీ ఆయిల్‌ఫీల్డ్ ద్వారా రవాణా, మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులను కోరమండల్ కంపెనీ ఏజీఎం ప్రసాద్, ఆర్గానిక్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ నాయుడు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పనగట్ల సుదర్శన్, టీజీ ఆయిల్‌ఫీల్డ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, ఏఈవోలు ఉమారాణి, జెస్సీ, హెచ్‌ఈఓ మంజుల, ఎఫ్ఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు ముందే భద్రాద్రిలో అభివృద్ధి పనులు పూర్తి

**- మాడవీధుల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి..**

**- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలి..**

**- సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట..**

**భద్రాచలం సెప్టెంబరు 26 (జనంసాక్షి)**



గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అధికారులను ఆదేశించారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని మాడవీధుల్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తి చేసి భక్తులకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని సూచించారు. శనివారం ఆలయ మాడవీధులు, చప్పిడి దిగువ రూటు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మృనాల్ శ్రేష్ట మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు శ్రీరామనవమికి ముందే భద్రాచలం ఆలయానికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మాడవీధుల రోడ్డు విస్తరణ పనులు ప్రణాళికాబద్ధంగా, సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశ, విదేశాల నుంచి భద్రాచలం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతోందన్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పనలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఈవో దామోదర్‌రావు, పీవీటీజీ అధికారి గన్యా నాయక్, తహసీల్దార్ రామ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవో జీపీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆటో యూనియన్ ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్ సెప్టెంబరు 26 (జనంసాక్షి)**

రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి బూర్గంపాడు ఆటో యూనియన్ అండగా నిలిచింది. మండల కేంద్రంలో కొంతకాలంగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఈర్ల నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి మృతుని కుటుంబానికి రూ.45 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సాదిక్ పాషా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆటో యూనియన్ సభ్యుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, కష్టాల్లో ఉన్న ప్రతి ఆటో యూనియన్ సభ్యుడికి అండగా ఉంటామని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన యూనియన్ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ అన్వర్ పాషా, ప్రధాన కార్యదర్శి పెద్ద యాకూబ్, సహాయ కార్యదర్శి కేసుపాక సంపత్, చిప్ప సాయి నిఖిల్, యూనియన్ పెద్దలు, సభ్యులు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే గో మహత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం

**సూర్యాపేట సేవా,ఆధ్యాత్మిక మిత్ర మండలి అధ్యక్షులు బొమ్మిడి అశోక్**

**సూర్యాపేట(జనంసాక్షి):**



జిల్లా కేంద్రంలోని రవి మహల్ నందు సూర్యాపేట సేవా, ఆధ్యాత్మిక మిత్ర మండలి ఆధ్వర్యంలో అక్టోబర్ 1న సాయంత్రం ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే గో మహత్యంపై ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం నిర్వహించబడుతుందని సూర్యాపేట సేవా, ఆద్యాత్మిక మిత్రమండలి అద్యక్షులు బొమ్మిడి అశోక్ తెలిపారు.శనివారం జిల్లా కేంద్రంలోని రవి మహల్ లో ఈ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రవచన కార్యక్రమం సమయానికి ప్రారంభం అవుతుందన్నారు. పట్టణ ప్రజలు ముందుగానే సభా వేదికకు చేరుకోవాలని అన్నారు.గోమాత వైభవం మీద ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుచే అత్యద్భుతమైన ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందని తెలిపారు.పట్టణ ప్రజలు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.రవి మహల్ కర్నాటి రవికి, ఏ3 యాడ్ ఏజెన్సీ ప్రసన్నకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సేవా, ఆధ్యాత్మిక మిత్రమండలి కార్యదర్శి వీరవల్లి విజయశంకర్, కోశాధికారి నూకల శైలేందర్, సభ్యులు కర్నాటి రవి, వాస చంద్రశేఖర్, గుండా సృజన్, బొమ్మిడి సంతోష్, ఇమ్మడి సందీప్, బేతు కిషోర్,కడుదుల రోహిత్, తూముల ప్రవీణ్, బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**○ లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన..**

**○ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు..**

**భద్రాచలం సెప్టెంబరు 26 (జనంసాక్షి)**

ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. దుమ్ముగూడెం మండలం చిన్న నల్లబల్లి గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మి భవానికి రూ.27 వేల, పెద్ద నల్లబల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకన్నకు రూ.54,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యం, వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, చేగొండి శ్రీనివాస్, చింతాడి రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.





# మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి విగ్రహావిష్కరణ పోస్టర్ల ఆవిష్కరణ

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 26 (జనంసాక్షి)

అర్వపల్లిలో అక్టోబర్ 1న జరిగే మాజీ మంత్రి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతానికై శనివారం అర్వపల్లిలో ఆర్డీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆర్డీఆర్ అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దరూరి యోగానందాచార్యులు, డీసీసీ ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మోరపాక సత్యం, పందిరి సురేందర్, సర్పంచులు బింగి కృష్ణమూర్తి, మంచాల లలితరామ్మూర్తి, నాయకులు బైరబోయిన మహరాజు, ఎల్లంల కొమిరెల్లి, డాక్టర్ రాజేష్, సురేష్, అజారుద్దీన్, లాలు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి పంట వేయవద్దు

**కనగల్లు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి)**

ఏలినీవో ప్రభావం కారణంగా వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటం తో యాసంగిలో వరి పంటలు వేయవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని చర్లగౌరారం, చిన్న మాదారం క్లస్టర్లను సందర్శించి రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను రైతులు తప్పక పాటించాలని రైతులు ముందుచూపు లేకుండా వరి నాట్లను వేస్తే నష్టం వాటిల్లుతుందని గుర్తు చేశారు. ఎరువులు, వ్యవసాయ పరికరాలలో సబ్సిడీ ప్రభుత్వం నుంచి పొందాలంటే రైతు గుర్తింపు కార్డులో పట్టాదార్ పాస్ పుస్తకం పొందిన ప్రతి రైతు తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. సుదూర ప్రాంతాలలో ఉన్న రైతులు వెబ్ ఆప్షన్ ద్వారా రైతు గుర్తింపు కార్డు పొందాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్ గౌడ్, చర్లగౌ రారం సర్పంచ్ చిలక రాజు సునీత వెంకటేశం, చిన్న మాదారం, చర్ల గౌరారం వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, దివ్య, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.





# మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ పాలనకు గుర్తుగా రక్తదాన శిబిరం

**మోటకొండూరు, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ అధినేతగా 25 వసంతాలు (13 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 12 ఏళ్లు భారత ప్రధానిగా) పూర్తి చేసుకున్న సందర్భంగా మోటకొండూరు మండల కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు భూమండ్ల సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎంఆర్వో రాజేంద్రప్రసాద్, ఎస్సై కుమారస్వామి యాదవ్, ఆర్ఐ రామారావు హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్లంల శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు, మండల పదాధికారులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలి

చిట్యాల, సెప్టెంబర్ 26 (జనం సాక్షి):



చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాల్లో రైతులకు విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు కత్తుల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నకాపర్తి, ఆరెగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. వర్షాలు సక్రమంగా లేక పంటలకు నీటి అవసరం పెరిగిన సమయంలో విద్యుత్ కోతలు విధించడం వల్ల వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. చిన్నకాపర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ప్రస్తుతం చిన్నకాపర్తి ఫీడర్ మాత్రమే పనిచేస్తోందని, పిట్టంపల్లి, బొంగోని చెరువు ఫీడర్లు పనిచేయడం లేదని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు




# పర్యావరణ పరిరక్షణపై నర్సింగ్ విద్యార్థులకు అవగాహన

సూర్యాపేట(జనంసాక్షి):

ఆరోగ్యకరమైన సమాజానికి పరిశుభ్రమైన పర్యావరణమే పునాది అని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఐఎన్‌సీ పాఠ్య ప్రణాళికలో భాగంగా భవానీ గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రీసైక్లింగ్, మురుగునీటి శుద్ధి కేంద్రాలను సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నర్సింగ్ విద్యార్థులకు ఆసుపత్రి సేవలతో పాటు పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ బాధ్యతపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఘన వ్యర్థాలను వేరు చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, మురుగునీటి శుద్ధి ప్రక్రియలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా క్షేత్రస్థాయి అవగాహన పొందారని పేర్కొన్నారు. తాము నేర్చుకున్న పర్యావరణ పరిరక్షణ అంశాలను సమాజంలో ప్రజలకు కూడా వివరించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ ప్రసాద్ విద్యార్థులకు వివిధ వ్యర్థాల నిర్వహణ విధానాలను వివరించారు. భవానీ గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ మతకల చలపతిరావు ప్రత్యేక చొరవ, మార్గదర్శకత్వంతో ఫీల్డ్ విజిట్ నిర్వహించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. తరగతి గది బోధనతో పాటు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సారథి, ప్రిన్సిపాల్ కీర్తన, సౌమ్య, జానకి, శిరీష, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కళలకు వన్నె తెచ్చిన మహనీయుడు ఎస్పీ బాలు

## మనం వికాస వేదిక ఆధ్వర్యంలో ఎస్పీ బాలుకు ఘన నివాళి

## ఆకట్టుకున్న జూనియర్ బాలు వేషాదరణలో యామ ప్రభాకర్, దుర్యోధన వేషధారణలో సకినాల కృష్ణ



**సూర్యాపేట(జనంసాక్షి):**

తెలుగు కళలకు ప్రపంచ వ్యాప్తంగా వన్నె తెచ్చిన మహనీయుడు గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని ప్రముఖ వ్యాపారవేత్త మీలా మహదేవ్, జిల్లా సహకార అధికారి కనిగిరి శ్రీ రామ్ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో మనం వికాస వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం 6వ వర్ధంతి కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు పాటలు ప్రపంచవ్యాప్తంగా వినిపించిన గొప్ప గాయకుడు బాలసుబ్రమణ్యం అన్నారు. తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళంలో అనేక పాటలను ఆయన పాడి నిర్మించాలని గుర్తు చేశారు. అలాంటి మహా గాయకుడిని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బాలు వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రతీ ఏటా ఘనంగా నిర్వహిస్తున్న మనం వికాస్ వేదికను వారు అభినందించారు. అనంతరం ముఖ్య అతిథి జిల్లా సహకార అధికారి కనిగిరి శ్రీరామ్, ప్రముఖ గాయకులు మధుబాపు శాస్త్రి, శ్రీదేవి బాలసుబ్రమణ్యం పాటల సంగీత విభావరి అలరించింది. అనంతరం ముఖ్య అతిథి జిల్లా సహకార అధికారి కనీగిరి శ్రీరామ్ తో పాటు గాయకుడు మధుబాపు, శ్రీదేవి లను మనం వికాస్ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వ్యాపార వేత్త యమా ప్రభాకర్ జూనియర్ బాల సుబ్రహ్మణ్యం వేషధారణ, సకినాల కృష్ణ దుర్యోధనుడి వేషధారణలో సభికులను అలరించారు. మనం వికాస్ వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షతన జరిగిన



ఈ కార్యక్రమంలో మనం వికాస వేదిక సభ్యులు డిఎస్వీ శర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ఇరిగి కోటేశ్వరి, జె. శశిధర్, అప్పం శ్రీనివాస్, యమా ప్రభాకర్, సకినాల కృష్ణ, తోట శ్యామ్, గండూరి శంకర్, గాలి శ్రీనివాస్, బోనగిరి భాస్కర్, మనం వికాస వేదిక సభ్యులు అంజన్ ప్రసాద్, చిట్టిపాక వీరయ్య, కర్ర వీరారెడ్డి, మన్సూర్ అలీ, రాజశేఖర్, కవులు, గాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




మోడీ ఫాసిజానికి, ట్రంప్ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

పి.డి.యస్.యూ. రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ

**కూసుమంచి, సెప్టెంబర్ 26, (జనంసాక్షి) :** భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని నేటి విద్యార్థులు, యువత పుణికిపుచ్చుకోవాలని పి.డి.యస్.యూ. రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతి వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.యస్.యూ.), ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్.) ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. పి.డి.యస్.యూ. ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి.డి.యస్.యూ. రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, పి.వై.ఎల్. జిల్లా కార్యదర్శి భరత్ మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు, ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తున్న యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పోరాడాలని వారు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం సాధించి దశాబ్దాలు గడిచినా పేదలందరికీ ఉచితంగా నాణ్యమైన, సమాన విద్య, వైద్యం అందించడంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పలువురు విద్యార్థులు ఉన్నత చదువులను మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్ బకాయిలను కోరుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం, విజిలెన్స్ అధికారులతో దాడులు చేయించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మతోన్మాద విధానాలతో దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ఐక్యత ప్రమాదంలో పడుతోందని వారు పేర్కొన్నారు. పాలస్తీనా, క్యూబా ప్రజల న్యాయమైన పోరాటాలకు దేశ ప్రజలంతా సంఘీభావంగా నిలవాలని, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధోన్మాద చర్యలను నిరసించాలని పిలుపునిచ్చారు. దేశంలో సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ ఆర్థిక దోపిడీకి వత్తాసు పలుకుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా షాహిద్ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.యస్.యూ. ఖమ్మం జిల్లా యాక్టివ్ కార్యదర్శి రఘు, పి.వై.ఎల్. పాలేరు డివిజన్ సహాయ కార్యదర్శి కొత్త రమేష్, పి.డి.యస్.యూ. నాయకులు దీపిక, ఇందు, సుప్రియ, సిరి తదితరులు పాల్గొన్నారు.



## నెల్లిపాక బంజర్‌లో ఘనంగా గణనాథుడి నిమజ్జనం

**అశ్వాపురం సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడిని శనివారం గ్రామ యువత, భక్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు. గ్రామంలో విఘ్నాలు తొలగి, పిల్లాపాపలు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థించారు. మేళతాళాలు, డప్పు చప్పుళ్ల, బాణసంచా నడుమ 'జై బోలో గణేష్ మహారాజ్‌కి జై' అంటూ నినాదాలు చేస్తూ భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం గణనాథుడిని గంగమ్మ వడిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఉత్సవ కమిటీ నిర్వాహకుడు ఏకాంబరం మాట్లాడుతూ.. నవరాత్రులు పండుగ వాతావరణంలో గణపయ్యకు పూజలు నిర్వహించి, గంగమ్మ గుడిలో నిమజ్జనం చేసినట్లు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులు మండల, గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక బంజర్ యూత్ సభ్యులు ప్రవీణ్, శివరాం ప్రసాద్, భవన్, బలరాం, నాగరాజు, భాస్కర్, సాయి కిషోర్, గ్రామ పెద్దలు, యువత, పిల్లలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న వైరా ఎస్సై పుష్పాలు రామారావు..

శిథిలా స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలి గృహ ఉన్నారు పునర నిర్మాణానికి 20 వేలు రూపాయలు చేయూత..



**జనం సాక్షి వైరా..** సెప్టెంబర్ 26నవైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు మోదుగు చుక్కమ్మ నివాసగృహం శిథిలాస్థితిలో ఉందగా విషయం తెలుసుకున్న వైరా ఎస్సై పుష్పాల రామారావు 20 వేల రూపాయల ఇంటి నిర్మాణానికి కావలసిన మెటీరియల్ లను అందించి గృహాన్ని పునర నిర్మాణాన్ని చేపట్టారు.. ఆ వృద్ధురాలు ఎస్సై పుష్పాల రామారావుని హద్దుకొని కన్నీరు పెట్టుకుంది. వృద్ధురాలి కి అండగా నిలిచిన ఎస్ఐ ని కుమారుడు గోవిందరావు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవాలని చేయూతనందించాలని స్థానిక గ్రామస్తులకు మరియు యువతను తెలియజేశారు.



## మధిరలో ఘనంగా జయంతి వేడుకలు

**మధిర, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మధిరలోని ఆమె విగ్రహానికి శనివారం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలను, భూమి కోసం, పేదల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, సాలిక సురేష్, కాంగ్రెస్ నాయకులు అల్లాడి గోపాల్రావు మోదుగు బాబు, మైలవరపు చక్రి, దోర్నాల సునీల్, బాడిస రవి, గాలి ప్రసాద్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం ఎస్సై ని పరామర్శించిన జిల్లా టి జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్



**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 26( జనంసాక్షి )** తిరుమలాయపాలెం మండల పరిధిలోని మంగళవారం నాడు గణేష్ నిమజ్జనం సందర్భంగా జరుగుతున్న వేడుకలలో పర్యవేక్షణ నిమిత్తం మండలంలో పర్యటించి రాత్రి ఒంటిగంట సమయంలో పోలీస్ స్టేషన్ కు చేరుకునే సమయంలో భవానీ హోటల్ దగ్గర (గొర్రమ్మ రాయి చెట్టు మూల మదతవద్ద) జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్, ఆయన డ్రైవర్ రాకేష్ గాయపడ్డ విషయం మనందరికీ విదితమే ఆయన చికిత్స పొందుతున్న ఖమ్మం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఖమ్మం జిల్లా టీజేసి చైర్మన్ మరియు పత్రిక విలేకరులు ఆయనని పరామర్శించి , కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్, జనం సాక్షి పత్రిక విలేఖరి ఏలూరు ఆనందరావు, నేటి శుభోదయం పత్రిక విలేఖరి గాదరి బాబు, ప్రథమ చికిత్స డాక్టర్ గండమల్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం

### మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్

రోస్టర్ పాయింట్లను సవరించాలి.. 28న భద్రాచలంలో మాల చలో - నిరసన దీక్షకు పిలుపు



**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ ఉపవర్గీకరణ లో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ ఆరోపించారు. 2011 జనాభా లెక్కలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ ఉపవర్గీకరణ చేయడం, మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపులో కోత విధించడం వల్ల విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎస్సీ ఉపవర్గీకరణ ప్రక్రియను ఏకపక్షంగా చేపట్టారని, ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా తీసుకున్న నిర్ణయాలపై పునఃపరిశీలన అవసరమని శేఖర్ పేర్కొన్నారు. ప్రస్తుత జనాభా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్లను న్యాయబద్ధంగా పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయానికి చట్టబద్ధతపైనా ప్రశ్నలు ఉన్నాయని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. మాలలకు కేటాయించిన రోస్టర్ పాయింట్లపై కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఆయన, భవిష్యత్తులో మాల విద్యార్థులు, నిరుద్యోగులు ఉద్యోగ, విద్యా రిజర్వేషన్లలో నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో జరిగిన లోపాలను సరిదిద్దడంతో పాటు మాలలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 28న భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, రోస్టర్ పాయింట్ల సవరణ కోరుతూ నిరసన దీక్ష, శాంతియుత నిరసన సభ, ర్యాలీ నిర్వహించనున్నట్లు దాసరి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, వివిధ జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి రోస్టర్ పాయింట్లను సవరించాలని, అవసరమైన చట్టపరమైన చర్యలు చేపట్టి న్యాయమైన రిజర్వేషన్ కల్పించాలని దాసరి శేఖర్ డిమాండ్ చేశారు.

## ఉచిత కుట్టు మిషన్ల దరఖాస్తులకు ఆహ్వానం

### మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం



**చండూరు, సెప్టెంబర్ 26 (జనంసాక్షి)** మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థిక స్వావలంబన సాధించడమే ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకం ప్రధాన లక్ష్యమని చండూరు మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులు. గ్రామాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణాల్లో రూ. 2 లక్షల లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ లేదా మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 30 లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన సూచించారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆరు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం

**మధిర, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):**
ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె. క్రిస్టఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మధిర మినీ స్టేడియంలో ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరం డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ టి. సునీల్ రెడ్డి , స్టేడియం ఇన్‌చార్జ్ వై. చిన్నీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం కొనసాగుతోంది. అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు వేములవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ శిబిర ప్రారంభం కార్యక్రమంలో మధిర రెండో వార్డు కౌన్సిలర్ బానోత్ రమణ నాయక్ శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాల కోసం ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణ శిబిరమునకు కబడ్డీ కోచ్‌లు ప్రవీణ్, శ్రీనివాస్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ ఉండగా. బ్యాడ్మింటన్ కోచ్ సునీల్ శిబిర నిర్వహణలో సహకరిస్తున్నారు .క్రీడాకారులకు శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న నిర్వాహకులను క్రీడాభిమానులు అభినందిస్తున్నారు.

## ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలి

**మధిర, సెప్టెంబర్ 26 (జనంసాక్షి)**



ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ఆకాంక్షించారు. స్థానిక 18 వ వార్డు లడక బజార్ లో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన గణపతి అభిషేకాలు, గణపతి హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలగణేష్ యూత్ వారు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 13వ రోజు వినాయక విగ్రహం వద్ద వినాయక ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సూర్యదేవర కోటేశ్వ రరావు, మట్టూరి రాజా, చేబ్రోలు భాస్కరరావు, కూరపాటి శ్రీను, ఎర్ర శ్రీనివాసరావు, గరీన నగేష్, మట్టూరి అరవింద్, బాహటం వెంకటేశ్వరరాజు, ముల్లంగిభాను, కాంతాల రవి, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కెనాల్ కింది గ్రామాలను వరి సాగుతో సస్యశ్యామలం చేసిన గోదావరి జలాలు. గోదావరి జలాలను ఎన్ఎస్ పి కెనాల్ కు అనుసంధానం చేయడంతో రైతుల ఆశలను సజీవంగా ఉంచుతూ పెనుబల్లి మండలంలో ఎన్ ఎస్ పి కెనాల్ ద్వారా నిండుగా పారుతున్న గోదావరి ఎర్రటి సాగునీరు.

పెనుబల్లి మండలం. జనంసాక్షి.




## పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టుకు టూర్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి )**
ఈరోజు శనివారం జిల్లా పర్యటన శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశానుసారం ఖమ్మం సోషల్ వెల్ఫేర్ పాఠశాల బాలికలను పులిగుండాల ఎకో ప్రాజెక్టు కు టూర్ తీసుకొని వెళ్లడం జరిగింది. అక్కడ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎకో టూరిజంలో ఫారెస్ట్ లోకి ట్రాకింగ్ తీసుకెళ్లడం జరిగింది . వారికి పులి గుండాల ఎకో ప్రాజెక్టు విశిష్టతను అక్కడ ఉన్న మొక్కలు జంతువులు గురించి పర్యావరణం గురించి. మరియు ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాల వల్ల పర్యావరణం కు అటవీ జంతువులకు జరిగే నష్టాన్ని పిల్లలకు అధికారులు వివరించారు. ఇలాంటి టూర్లు పిల్లలకు మానసిక ప్రశాంతతకు. ఏకాగ్రతకు ఉపయోగపడుతుందని తెలిపారు. మనం నివసిస్తున్నటువంటి ప్రాంతం నుండి వేరే ప్రాంతంలోకి వెళ్లి అక్కడ ఉన్నటువంటి విశేషాలను తెలుసుకోవడమే టూరిజం అని దీని ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు ట్రెక్కింగ్ మంచిగా ఎంజాయ్ చేశారు . ఈ యొక్క కార్యక్రమంలో. జిల్లా పర్యటక్షక అధికారి సుమన్ చక్రవర్తి . తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమ, సెక్షన్ఆఫీసర్ కవిత బీట్ ఆఫీసర్ కేశవరావు . సోషల్ వెల్ఫేర్ విద్యార్థుల స్టాఫ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## గరికపాడు కేవీకేను సందర్శించిన తేజ విద్యాలయ విద్యార్థులు

**కోదాడ, సెప్టెంబర్ 26( జనంసాక్షి):**
ఎన్టీఆర్ జిల్లా గరికపాడు డాక్టర్ కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను శనివారం తేజ విద్యాలయం విద్యార్థులు సందర్శించారు. ఈ పర్యటనలో కేవీకే శాస్త్రవేత్తలు విద్యార్థులకు కేంద్రంలో జరుగుతున్న వివిధ పరిశోధనలు, పంటల ఉత్పత్తి విధానాలు మరియు సస్యరక్షణ చర్యల గురించి సమగ్రంగా వివరించారు. అలాగే వివిధ రకాల మొక్కల ప్రవర్ధన పద్ధతులు, సుస్థిర వ్యర్థాల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతికతలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు కేవీకేలోని వివిధ ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం ప్రాముఖ్యత గురించి కూడా శాస్త్రవేత్తలు విద్యార్థులకు వివరించారు. ఈ పర్యటనలో పాఠశాల ఉపాధ్యాయులు, కేవీకే శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కూల్చివేతలతో నాకేం సంబంధం లేదు!

**○అట్రాసిటీ కేసు విచారణకు సహకరిస్తా..**
**○డ్యాన్స్‌లో 'కత్తి' వ్యవహారమూ నా దృష్టిలో లేదు**
**○అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బురదజల్లుతున్నారు**
**○ పువ్వాడ ఉదయ్ నగర్ సర్పంచ్ షేక్ సిద్దిక్**

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ఖమ్మం పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్‌లో జరిగిన అక్రమ కట్టడాల కూల్చివేత వ్యవహారంతో తనకు గానీ, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి గానీ ఎలాంటి సంబంధం లేదని స్థానిక సర్పంచ్ షేక్ సిద్దిక్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కొందరు పనిగట్టుకుని తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుకు సంబంధించి పోలీసులు పిలిస్తే ఏ విచారణకైనా తాను సిద్ధమని, చట్టంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని సిద్దిక్ స్పష్టం చేశారు. విచారణ జరిగితే అసలు నిజానిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన వినాయక ఉత్సవాల్లో స్థానికుల ఆహ్వానం మేరకే తాను పాల్గొన్నానని, ఆ సమయంలో ఎవరో డ్యాన్స్ చేస్తూ చేతిలో కత్తి లేదా నకిలీ కత్తి పట్టుకున్న వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. దీనిపై కూడా పోలీసులు దర్యాప్తు జరిపి వాస్తవాలను తేలుస్తారని చెప్పారు. పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కొందరు కావాలని తనపై, పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సిద్దిక్ మండిపడ్డారు. వ్యక్తిగత, రాజకీయ స్వార్థం కోసం అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఇలాంటి నిరాధార ప్రచారాలతో ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని, న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఖమ్మంలో జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
ఎన్నికల సంఘం ప్రధాన అధికారి గా జ్ఞానేష్ కుమార్ కు కొనసాగే హక్కు లేదు అని వెంటనే రాజీనామా చేయాలని పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్రావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఓటర్ల జాబితా సవరణ, సర్ అమలుకు సంబందించిన పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు అని నివేదికలు స్పష్టం చేశాయని పేర్కొన్నారు. ముగ్గురు లో మెజారిటీ అభిప్రాయాలను జ్ఞానేష్ కుమార్ పాటించకుండా అతను తన నిర్ణయాలను అమలు చేశాడు అని ఆరోపించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా వుంది అని ఇన్నాళ్ళు జ్ఞానేష్ కుమార్ చేసిన వాదన పూర్తి అబద్ధం అని ఇప్పుడు స్పష్ట మవుతుంది అని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కూడా మోడీ కి లాభం వచ్చేలా జ్ఞానేష్ కుమార్ పని చేశాడు అని ఆరోపించారు. అర్హత వున్న ఓట్లు తొలగించి ఇష్టారాజ్యంగా బిజెపి కీ అనుగుణంగా ఈసీ పని చేసింది అని విమర్శించారు. మోడీ కి తొత్తుగా జ్ఞానేష్ కుమార్ వున్నాడు అని, అతను వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వ్యవస్థలను మోడీ తన గుప్పిట్లో పెట్టుకొని ఎన్నికల్లో గెలుపు సాధిస్తున్నారు అని ఆరోపించారు. జనం ఓట్లు తో మోడీ గెలవడం లేదు అని కేవలం కొన్ని సాంకేతిక లెక్కలతో, ఎంపిక చేసిన ఓట్లతో మాత్రమే మోడీ విజయం సాధిస్తున్నారు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసురావు, వంగూరి రాములు, సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, జబ్బార్, నందిపాటి మనోహర్, మెరుగు రమణా, ఐ మీరా సాహెబ్, భుక్యా శ్రీనివాసు రావు, నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, బత్తుల ఉపేంద్ర, వజేనేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు




## డిగ్రీ అడ్మిషన్లకు చివరి అవకాశం

### సెప్టెంబర్ 28, 29న వన్‌టైమ్ స్పాట్ డ్రైవ్

**భద్రాచలం సెప్టెంబరు 26 (జనంసాక్షి)**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), భద్రాచలంలో డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశంగా సెప్టెంబర్ 28, 29 తేదీల్లో వన్‌టైమ్ స్పాట్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. జాన్ మిల్టన్ తెలిపారు. దోస్త్‌లో ఇప్పటివరకు నమోదు చేసుకున్నప్పటికీ సీటు రాని విద్యార్థులు, సీటు వచ్చినా అడ్మిషన్‌లో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యార్థులతో పాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో విద్యార్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా కళాశాలలో ఉచిత సహాయం అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేజ్ కుమార్ రాజీనామా చేయాలి :సీపీఎం

## దేశవ్యాప్త పిలుపులో భాగంగా రామన్నపేటలో సిపిఎం నిరసన




**రామన్నపేట, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గా జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక సుభాష్ సెంటర్ లో సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా స్వామ్యంను ఖూనీ చేస్తుంది అని అన్నారు. సర్ పేరు తో సామాన్య ప్రజల ఓట్ల ను తొలిగిస్తూ ప్రజలను గందర గోళానికి గురిచేస్తుందన్నారు. ఇంగ్లీష్ నుండి తెలుగు లోకి అధికారులు ట్రాన్స్ లెట్ చేస్తున్నప్పుడు మార్పు వచ్చిన వారికీ నోటీసులు రావడం ఇప్పటి వరకు సర్ చేసిన దాంట్లో 13లక్షల ఓట్లను తొలిగించారు అంటే ఎంత బాధాకరం అంతే కాకుండా 2023లో తెచ్చిన చట్టం ఇ సి ఐ ఎలక్షన్ కమిటీ నీ ఎన్నుకునే చట్టం ను రద్దు చెయ్యాలి. గతం లో నియామకం లో దేశ ప్రధాన మంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతి ప్రతి పక్ష నాయకులు గా ఉండే దానిని రద్దు చేసి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీ తొలిగించి వారి స్థానంలో ప్రధాన మంత్రి చూపించిన క్యాబినెట్ మంత్రి కీ అవకాశం ఇవ్వడం అంటే మెజారిటీ గా కేంద్ర ప్రభుత్వ అధీనంలో పెట్టుకోవడమే అని ఇంత దుర్మార్గంగా ప్రజాస్వామ్యం ను నాశనం ఆశ చేస్తున్నారని మండి పడ్డారు. నిష్పాక్షపాతం గా ఉండాల్సిన ఎన్నికల కమిషన్ ను బీజేపీ ఎన్నిక కమిషన్ గా చేశారు. దాంట్లో భాగంగానే జ్ఞానేశ్వర్ ఎన్నికైడు సి ఇ సి కమిటీ లో ఛిఫ్ కమిషనర్, ఇద్దరు కమిషనర్ లు ఉన్న కమిటీ లో ఇద్దరు కమిషనర్ ల అభ్యంతరాలను పక్కనపెట్టి ఏకపక్షంగా ఫార్మ్ 6 కొత్త ఓటర్ నమోదు ప్రక్రియ లో కుటుంబ సభ్యుల వివరాలు ఉండాలి అని నిబంధనలు తేవడంను దేశ వ్యాప్తంగా బీజేపీ నాశనం చ ేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సర్ మీరు రద్దు చేయాలి మరియు 2023లో తెచ్చిన చట్టం ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఎన్నిక ప్రక్రియను వెంటనే రద్దు చెయ్యాలి. ఎన్నికల కమిషన్ చీఫ్ కమిషనర్ జ్ఞానేశ కుమార్ వెంటనే రద్దు చెయ్యాలని ఆధ్వర్యంలో హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, మండల నాయకులు బావం డ్లపల్లి బాలరాజు,వేముల సైదులు, నీల అయిలయ్య, మునికుంట్ల లెనిన్, మేడి ముకుంద,శానగొండ వెంకటేశర్లు, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, అప్పం సురేందర్, ఆముద ఆంజనేయులు, బండ జగన్, నాగటి అంజయ్య, వళ్ళమళ్ళ నర్సింహా,అక్కెనపల్లి వీరయ్య, గొరిగే మల్లేష్, తుర్కపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీర నారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

### ఘనంగా ఐలమ్మ జన్మదిన వేడుకలు

### పాల్గొన్న తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, ఏపూరి సోమన్న



**నూతనకల్ సెప్టెంబర్ 26 (జనంసాక్షి)** నూతనకల్ మండల కేంద్రం లింగంపల్లి రోడ్ చింత కింది బజారులో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ ను తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, ప్రజా యుద్ధ నౌక ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న తో కలిసి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొని వారు మాట్లాడుతూ నిజాం కాలంలో ఇస్నూర్ దేశ్ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, ఆయన తల్లి జానకమ్మ అరాచకాలను ఎదురొడ్డి రొమ్ము చాచి నిలబడి పాలకుర్తి ప్రాంత ప్రజల హక్కులను సాధించిన గొప్ప తెలంగాణ యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని వారు కొనియాడారు ఇలాంటి గొప్ప ధైర్యవంతురాలు రజక చాకలి కుటుంబంలో పుట్టడం మా అదృష్టం అని రజక సంఘం రాష్ట్ర నాయకులు బిక్షపతి, జిల్లా అధ్యక్షుడు వీరమల్ల వెంకన్న మండల నాయకుడు మైలారపు ఉప్పలయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత మాజీ సర్పంచ్ తీగల కరుణ శ్రీ,,యూత్ కాంగ్రెస్ నాయకుడు పసుల అశోక్ యాదవ్, రజక సంఘం నాయకులు వీరస్వామి, నెల్లుట్ల భరత్ వీరమల్ల శ్రీను నరసయ్య భాను వంశీ మహేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### మొక్కలు నాటుతున్న సర్పంచ్ ఓగ్గు కిరణ్ కుమార్ ప్రధానోపాధ్యాయులు నల్ల శ్రీనివాస్

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి) :** మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్ 3.0' కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులునల్ల శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ ఒగ్గు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తమ తల్లితో కలిసి ఒక మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటడం అదే విధంగా నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రధాన పాత్ర వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.కె. అఖిల్, ఉపాధ్యాయులు శిగ మహేష్, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ అనంత పద్మనాభ స్వామికి పౌర్ణమి పూజలు

**హుజూర్ నగర్ రూరల్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీ నరసింహ వేణుగోపాల స్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ అనంత పద్మనాభ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ పూజా కార్యక్రమంలో స్వామి వారికి గజమాల అలంకరణ, వస్త్రాలంకరణ, ఫల నివేదన చేశారు. రూ.1500 చెల్లించి నల్గొండకు చెందిన ఇమ్మడి రమేష్, పద్మ దంపతులు కుటుంబ సభ్యులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యానిర్వహనాధికారి ఎంపీ లక్ష్మణ్ రావు, ఆలయ చైర్మన్ యరగాని భిక్షం గౌడ్, ఆలయ ధర్మకర్తలు:- యరగాని సతీష్, ప్రార్థన బోయిన గంగయ్య. గూడెపు నాగలింగం. అద్దంకి సంధ్య. పిట్టల గురవయ్య. కస్తల శంకర్. ఆలయ అర్చకులు ముదుంబై హరీష్ కుమారా చార్యులు. ములుగు రవితేజ. రంగనాధ్. వీరేశ్వరావు. కనకయ్య. గురవయ్య. కీర్తి. రజని. కావ్య. పుష్పలత. నాగమణి. లక్ష్మి. మనస్వి. ఆలయ సిబ్బంది యరగాని కిరణ్ గౌడ్, జి శ్రీనివాస్ రెడ్డీ. వై రమేష్. వై ఉపేందర్. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### జాజిరెడ్డిగూడెంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు , వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తి దాయకమని జాజిరెడ్డి గూడెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి వేల్పుల రమేష్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని వై జంక్షన్ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శిగ నసీర్ గౌడ్, కె. అవిలయ్య, సర్పంచులు విద్యాసాగర్, పాశం కరుణాకర్‌రెడ్డి, ఎంపిటీసీ డైరెక్టర్ జలేంధర్, కృష్ణమూర్తి, విక్రం, ఆత్మ కమిటీ సభ్యుడు నర్సింగ వెంకటేశ్వర్లు, మధు, అమీనుద్దీన్, వజ్జే వీరయ్య, మందాలరాములు,నాగరాజు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఎంపీడీవో ఝాన్సీ

**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** మండల పరిధిలోని అర్వపల్లి పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ లో శనివారం నిర్వహించిన 'రోల్ మోడల్' కార్యక్రమానికి జాజిరెడ్డిగూడెం మండల ఎంపీడీవో ఝాన్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఝాన్సీ తన జీవిత పయనాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు. ఆమె సందేశాన్ని విన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు భావోద్వేగానికి గురయ్యారు. తమ తల్లిదండ్రుల కష్టాన్ని, త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. సరైన లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, మధుకర్, విమల, ప్రసన్నకుమారి, అంజలి, ఇమాం, వినయ్, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## హుజూర్‌నగర్‌లో 9వ జాతీయ పోషణ మాసం వేడుకలు

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 26 (జనంసాక్షి):** మన అంగన్‌వాడీ మన బాధ్యత అని హుజూర్‌నగర్ సీడీపీఓ ఆడావత్ పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నట్టే రమాదేవి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండలం లింగగిరి రైతు వేదికలో 9వ జాతీయ పోషణ మాసాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు సమాజ పోషణ, ఆరోగ్యం, బాల్య విద్యా వికాసానికి ప్రధాన కేంద్రాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో పోషకాహార లోపం తగ్గించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. అనంతరం 16 మంది గర్భిణీ స్త్రీలకు ఘనంగా సీమంతం నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏవో స్వర్ణ, లింగగిరి పిహెచ్సి డాక్టర్ వేణుగోపాల్, పోషణ్ అభియాన్ బీసీ రాజేష్, విజయ్ కుమార్, సాయి త్రిలోక్, పంచాయతీ కార్యదర్శి సోనేర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్‌లో బెల్ట్‌షాపుల జోరు!

- "బెల్ట్‌షాపులు ఉండవు" అన్న ఎమ్మెల్యే మాటకు సవాల్
- కిరాణా ముసుగులో మద్యం..
- తెల్లవారుజాము నుంచే విక్రయాలు
- అర్ధరాత్రి దాటినా 'తలుపు తడితే' బాటిల్.. సిట్టింగ్‌లపై ఆరోపణలు

మర్రిగూడ/గట్టుప్పల్, సెప్టెంబర్ 26 (జనం సాక్షి) "బెల్ట్‌షాపులు ఉండవు" అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గతంలో స్పష్టంగా ప్రకటించారు. అయితే గట్టుప్పల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు, తండాల్లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు ఆ హామీ అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.జనం సాక్షి క్షేత్రస్థాయి పరిశీలనలో స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు, తండాల్లో తెల్లవారుజాము నుంచే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, రాత్రివేళ దుకాణాలు మూసివేసినట్లు కనిపించినా తలుపు తడితే మద్యం అందిస్తున్నారని వారు ఆరోపించారు.

**పేరుకే కిరాణా.. లోపల మద్యం!**

కొన్ని చోట్ల కిరాణా దుకాణాల ముసుగులో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోనే మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. బయటకు నిత్యావసర సరుకులు.. లోపల మాత్రం మద్యం బాటిళ్లు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**వైన్‌షాపుల నుంచే సరఫరా?**

బెల్ట్‌షాపులకు మద్యం ఎక్కడి నుంచి వస్తుందన్నది ప్రశ్నగా మారింది. వైన్‌షాపుల నుంచి ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా గ్రామాలు, తండాలకు మద్యం తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ ఆరోపణలపై ఆబ్కారీ శాఖ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను తేల్చాల్సిన అవసరం ఉంది.

**సిట్టింగ్‌తో దందా?**

కొన్ని ప్రాంతాల్లో మద్యం విక్రయాలతో పాటు సిట్టింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లెట్ వంటి ఆహార పదార్థాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారని స్థానికులు చెబుతున్నారు.దీంతో కొన్ని అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు బార్‌లను తలపిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిషేధిత రోజుల్లోనూ ముందుగానే మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే.. మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? అన్నది అధికారులు తేల్చాల్సి ఉంది.

**హామీ అమలయ్యేదెప్పుడు?**

బెల్ట్‌షాపుల నిర్మూలనపై ఎమ్మెల్యే గతంలో కఠిన వైఖరి ప్రకటించిన నేపథ్యంలో.. గట్టుప్పల్‌లో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఆయన హామీ అమలుకు పరీక్షగా మారాయి. ఎమ్మెల్యే ఆదేశాలు ఉన్నా అక్రమ విక్రయాలు కొనసాగుతున్నాయా?అలా అయితే అధికార యంత్రాంగం ఎందుకు అడ్డుకోలేకపోతోంది? క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎందుకు కొరవడింది? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**కుటుంబాలపై మద్యం భారం**

బెల్ట్‌షాపుల ద్వారా మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీల సంపాదనలో కొంత భాగం మద్యానికి ఖర్చవుతుండటంతో కుటుంబ అవసరాలు, పిల్లల చదువులపై ప్రభావం పడుతోందని వారు చెబుతున్నారు.గట్టుప్పల్ మండలంలో బెల్ట్‌షాపులపై వస్తున్న ఆరోపణలపై పోలీసులు, ఆబ్కారీ శాఖ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.అదే సమయంలో తాను గతంలో ఇచ్చిన బెల్ట్‌షాపుల నిర్మూలన హామీ క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతోందో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.



## వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి

నల్లగొండ ప్రతినిధి,సెప్టెంబర్ 25,(జనం సాక్షి): వయోవృద్ధుల వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నంద్యాల ప్రేమ్ కరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం తన కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారి లావణ్య కుమారితో కలిసి ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్‌తో పాటు వయోవృద్ధుల హక్కుల పుస్తకాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు జిల్లాలో వివిధ అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల్లో కుటుంబంలోని పెద్దలు, వయోవృద్ధుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమాల వివరాలు సెప్టెంబర్ 26 సాంస్కృతిక కార్యక్రమాలు, సెప్టెంబర్ 27 ఆర్థిక లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన, సెప్టెంబర్ 28 యోగ సాధన,సెప్టెంబర్ 29 వయోవృద్ధుల చట్టాలపై అవగాహన,సెప్టెంబర్ 30 తల్లిదండ్రులు, వయోవృద్ధులను గౌరవించాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ,అక్టోబర్ 1అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వయోవృద్ధులకు, వారికి సేవలు అందించిన వ్యక్తులకు సన్మానం చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్, కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, బిక్షపతి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, వయోవృద్ధులసంరక్షణ కేంద్రం కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పాలనను గాలికి వదిలేశారు: ఆకునూరి మురళి

నల్లగొండ, సెప్టెంబర్ 26,(జనంసాక్షి): తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పాలనను గాలికి వదిలేశారని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టీపీఎఫ్) కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి విమర్శించారు. పిల్లల గౌరవం, విద్యా హక్కులతో ఇంకెంతకాలం రాజీపడతారని ఆయన ప్రశ్నించారు.నల్లగొండలోని లయన్స్ క్లబ్ భవన్‌లో టీపీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.పాఠశాల ప్రాంగణాలను ఇతర ప్రభుత్వ శాఖల అవసరాలకు వినియోగించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. పాఠశాలల్లో నీటి ట్యాంకులు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఎంఈఓ కార్యాలయాలు, యునాని ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయుడు నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రసంగాలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు కనిపించడం లేదన్నారు. అరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ 21వ శతాబ్దపు పాఠశాల ఎలా ఉండాలో 52 అంశాలతో చూపించిందని తెలిపారు. ప్రతి మండలంలో ఇలాంటి పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. టీపీఎఫ్ చేపట్టిన 12 రోజుల విద్యా బస్ యాత్రలో భాగంగా శనివారం మాడుగులపల్లి మండలంలోని మాడుగులపల్లి గ్రామంలో 'బడి నిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రం, యునాని ఆసుపత్రి, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం ఉన్నాయి.ప్రాథమిక పాఠశాలలో 36 మంది విద్యార్థులు, ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఒకే గది, శిథిలావస్థలో మరుగుదొడ్డి, కుళాయిలు లేని నీటి వసతి మాత్రమే ఉన్నాయని టీపీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. హైస్కూల్‌లో 46 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు.టీపీఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఎం. చంపాలాల్ మాట్లాడుతూ తమ మూడు ప్రధాన డిమాండ్ల సాధన కోసం చివరి వరకు పోరాడతామని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ విద్యా ఖర్చులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ పద్మజ షా, ఆకునూరి మురళి, ఎం. చంపాలాల్, సృజన యాదవ్, ముప్పూరి కుమారన్న, నిఖిల్ విజయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కుట్టు మిషన్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### 100% సబ్సిడీతో బీసీ మహిళలకు ఉచితంగా పంపిణీ

### దరఖాస్తులకు సెప్టెంబరు 30 ఆఖరి తేదీ మరో 4 రోజులే గడువు:సర్పంచ్ బొమ్మకంటి కల్పన

మాడుగులపల్లి, సెప్టెంబర్ 26 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం ప్రవేశపెట్టిన 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకాన్ని మాడుగులపల్లి మండలంలోని అర్హులైన మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని బొమ్మకల్లు గ్రామ సర్పంచ్ బొమ్మకంటి కల్పన పిలుపునిచ్చారు ఈ పథకం కింద అర్హులైన బీసీ మహిళలకు 100 శాతం ఉచిత సబ్సిడీతో కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబరు 30 వరకు మాత్రమే అవకాశం ఉందని, మరో 4 రోజులు మాత్రమే గడువు ఉన్నందున అర్హులైన మహిళలు వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు పథకం అర్హతలు – నిబంధనలు ఆదాయ పరిమితి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2.00 లక్షలు మించకూడదు ప్రాధాన్యత పేద మహిళలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు అనాథలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వబడుతుంది అర్హత కలిగిన మహిళలు మీసేవ/ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా లేదా అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌లో త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ బొమ్మకంటి కల్పన కోరారు.



## సీతారాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



సూర్యాపేట (జనంసాక్షి): శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని శ్రీవేదాంత భజన మందిర కమిటీ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీవేదాంత భజన మందిరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వినాయకుని లడ్డుని భానుపురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు దక్కించుకోవడంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వేదాంత భజన మందిరం కమిటీ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర రావు, కార్యదర్శి నకిరేకంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, షీలా శంకర్, సోమ సుమన్, అర్చకులు సింగరాచార్యులు, రాఘవాచార్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రాచకొండ శ్రీనివాస్, గుండా వెంకన్న, సోమా ప్రవీణ్,కక్కిరేణి ప్రసాద్, ఈగ వెంకటేశ్వర్లు, సోమ సోమేశ్వరరావు, సోమ నరసింహారావు, బిక్కుమల్ల సంతోష్, చల్లా సత్యనారాయణ, కుంచపర్తి రాజశేఖర్, వీరవెల్లి ఉమా, బిక్కుమల్ల సంతోష్ దోగుపర్తి ప్రవీణ్, భువనగిరి కృష్ణ, వీర్లపాటి వెంకటేశ్వర్లు, కొత్త వెంకన్న, బెలిదే అంజయ్య, తోట లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.